# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 20-11-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. బ్రెజిల్ పర్యటనను ముగించుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు నుంచి మూడు రోజులపాటు గయానాలో పర్యటిస్తారు.
2. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు జార్ఖండ్ శాసనసభ చివరి విడత ఎన్నికలు ఈరోజు జరుగుతాయి.
3. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది.
4. తెలంగాణలో వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.
5. గోవాలో 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం-ఇఫీ ఈరోజు నుంచి ప్రారంభంకానుంది.

=========================

బ్రెజిల్ పర్యటనను ముగించుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు నుంచి మూడు రోజులపాటు గయానాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆ దేశ రాజధాని జార్జ్‌టౌన్‌లో గయానా అధ్యక్షులు డాక్టర్ మహమ్మద్ ఇర్ఫాన్ అలీతో ప్రధానమంత్రి సమావేశమై చర్చలు జరుపుతారు. అనంతరం కరేబియన్ కమ్యూనిటీ కామన్ మార్కెట్-ఇండియా సదస్సులో ప్రధానమంత్రి పాల్గొంటారు. కాగా 1968 తర్వాత భారత ప్రధానమంత్రి గయానాలో పర్యటించడం ఇదే తొలిసారి.

-------------------------

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతో పాటు జార్ఖండ్ శాసనసభ చివరి విడత ఎన్నికలు ఈరోజు జరుగుతాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఎన్నికల సంఘం పూర్తి చేసింది. మహారాష్ట్రంలోని మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఈ ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. మొత్తం 4 వేల 136 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే జార్ఖండ్ లోనూ చివరి దశ పోలింగ్ ఈ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. మొత్తం 12 జిల్లాల్లోని 38 నియోజకవర్గాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు రాష్ట్ర మంత్రి వర్గం సమావేశం జరగనుంది. శాసనసభ సమావేశాల అనంతరం సాయంత్రం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం జరిగిన తొలి రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు తీసుకున్న నిర్ణయాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేలా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శాసన సభ సమావేశాల్లో రహదారుల నిర్వహణపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి నిన్న మాట్లాడుతూ, ఉభయ గోదావరి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. రహదారుల మరమ్మతులకు 850 కోట్ల రూపాయలను మంజూరు చేసి పనులు చేపట్టామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ( 31 సెకన్లు)

-----------------------------

తెలంగాణలో వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తైన సందర్భంగా హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరంగల్ లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయంతో అభివృద్ధి వేగవంతం కానుందని అన్నారు. సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగని వారి రుణాలన్నీ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు)

-----------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనససభ సమావేశాలు ఈరోజు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 'తొలి 150 రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం అమలు' అనే అంశంపై ఈ రోజు శాసనసభలో ప్రత్యేక చర్చ చేపట్టనున్నారు. అలాగే రాష్ట్ర నూతన ఎక్సైజ్ విధానంపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సభలో ప్రకటన చేయనున్నారు. ద్రవ్య వినిమయ బిల్లు-2024ను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు.

-----------------------------

గోవాలో 55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం – ఇఫీ ఈరోజు నుంచి ప్రారంభంకానుంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ఈ రోజు నుంచి ఈ నెల 28వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు గోవాలో నిర్వహిస్తారు. 16 ప్రత్యేక విభాగాల్లో అనేక దేశాల నుంచి వచ్చిన పలు చలనచిత్రాలను ఈ ఉత్సవంలో పదర్శించనున్నారు. ఇండియన్ పనోరమా. విభాగంలో మొత్తం 384 ఎంట్రీల నుంచి ఎంపిక చేసిన 25 ఫీచర్ చిత్రాలను ప్రదర్శిస్తారు. రణదీప్ హూడా రూపొందించిన హిందీ సినిమా 'స్వాతంత్ర్య వీర సావర్కర్' ఇండియన్ పనోరమాలో తొలి చిత్రంగా ప్రదర్శిస్తారు. అంతర్జాతీయ చిత్రాలే

కాకుండా తెలుగు, కన్నడ, హిందీ, తమిళం, మరాఠీ, గుజరాత్, అస్సామీ, మళయాళం, బెంగాలీ వంటి భారతీయ భాషల చిత్రాలను ఈ ఉత్సవంలో ప్రదర్శిస్తారు.

55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ప్రారంభం సందర్భంగా ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు రాత్రి 8 గంటల 40 నిమిషాలకు ప్రసారమవుతుంది.

-------------------------

శబరిమల క్షేత్రానికి వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ మొత్తం 26 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించింది. ఈనెల 25, డిసెంబర్ 2, 9, 16 తేదీల్లో మచిలీపట్నం - కొల్లాం, ఈనెల 20, 27, డిసెంబర్ 4, 11, 18 తేదీల్లో కొల్లాం- మచిలీపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. అలాగే తిరుగు ప్రయాణం కోసం ఈ నెల 23, 30 తేదీల్లో మచిలీపట్నం- కొల్లాం మధ్య 2 రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది.

-------------------------

రైతులు పండించే పంటలకు మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్..18 సెకన్లు

-------------------------

దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల మీదుగా ఉపరితల ఆవర్తనం రేపు ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి ఆగ్నేయ బంగాళా ఖాతం మీదుగా ఈ నెల 23న అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోనూ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఇది ఇలాఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాలైన లంబసింగి, అరకు, దుంబ్రిగూడ, జి.మాడుగులలో 8 నుంచి 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

====================